సాక్షి తిరుపతి

గురువారం । 8 । మే । 2025



12న పత్ర.. పుష్పయాగం

తిరుపతి కల్చరల్ : కపిలేశ్వరస్వామి వారికి ఈ నెల 12వ తేదీన పత్ర, పుష్పాలతో విశిష్ట యాగం నిర్వహించనున్నారు.



నేటి నుంచి సీపీఎం సమావేశాలు

తిరుపతి కల్చరల్ : తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో గురువారం నుంచి సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించనున్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 69,214 మంది స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.27 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, టికెట్లు లేకుంటే 6 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

న్యూస్‌రీల్

20లోపు 'సుఖీభవ' సమాచారం

తిరుపతి అర్బన్ : జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అర్హుల వివరాలను ఈ నెల 20వ తేదీలోపు అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జాబితా సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు రైతు సేవా కేంద్రాల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఈ పథకం కింద పీఎం కిసాన్ నగదు రూ.6వేలతో కలిసి ప్రభుత్వం విడతలవారీగా రూ.14 వేలు అందించనుంది. జిల్లా వెబ్‌ల్యాండ్ ఆధారంగా చూస్తే మొత్తం 1,43,432 మంది రైతులు ఉన్నారు. రాష్ట్రస్థాయి వెబ్‌ల్యాండ్ ప్రకారం కౌలు రైతులను పరిగణలోకి తీసుకుంటే జిల్లాలో 1,72,657 మంది ఉన్నట్లు తెలుస్తోంది. వీరి వివరాలతో జాబితా తయారు చేసేందుకు అగ్రికల్చర్ అసిస్టెంట్లు కసరత్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి



ఏఆర్ కానిస్టేబుల్ డిల్లీ

వడమాలపేట (విజయపురం) : తిరుపతిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న డిల్లీ (40) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. నాగలాపురం వినోబానగర్‌కు చెందిన డిల్లీ తిరుపతిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా.. వడమాలపేట కదిరిమంగళం మలుపు వద్ద వెంకటగిరికి చెందిన ఓ కుటుంబం అంజేరమ్మను దర్శించుకుని కారులో తిరిగి వెళ్తూ ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన డిల్లీని పోలీసులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు.

డప్పు కొట్టేందుకు వచ్చి.. అనంత లోకాలకు..!



మృతి చెందిన తిరుపతన్న

తిరుపతి క్రైమ్: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీసుల కథనం.. నెల్లూరు జిల్లా గాంధీజీ కాలనీకి చెందిన పెద్దల తిరుపతన్న(20) తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరలో డప్పు కొట్టేందుకు వచ్చాడు. ఈ క్రమంలో కొరమీనుగుంటలో ఓ ఇంటి వద్ద వేపాకు కోస్తుండగా విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాల తరలించారు.

ఐపీఎల్ తరహాలో సీపీఎల్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విజయకుమార్ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్), ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) తరహాలో చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సీపీఎల్) సీజన్–1 క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయకుమార్ తెలిపారు. బుధవారం తిరుపతిలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18 నుంచి తిరుపతిలోని ఎస్వీయూ మైదానంలో సీపీఎల్ టోర్నీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 17నుంచి 35 ఏళ్ల లోపు ఉన్న క్రికెటర్లు పాల్గొనవచ్చని, ఈ నెల 11న మొత్తం 5జట్లను ఎంపిక చేయనున్నట్టు చెప్పారు. అనంతరం పోటీల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం నేతలు గిరి ప్రకాష్, శ్రీనివాసమూర్తి, శ్రీధర్‌కుమార్, సతీష్ యాదవ్, హరి, శివప్రసాద్, డీవీ.రమణ పాల్గొన్నారు.

సిందూర్.. సలామ్

ఉగ్రమూకపై భారత సైన్యం విరుచుకుపడింది. పౌరుల జోలికి వస్తే ఎలా ఉంటుందో దాయాది దేశానికి రుచి చూపించింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాద స్థావరాలను తుడిచిపెట్టేసింది. కేవలం 24 నిముషాల్లోనే 9 టెర్రరిస్ట్ క్యాంపులను ధ్వంసం చేసేసింది. త్రివిధ దళాల తెగువను యావత్ దేశం కొనియాడుతోంది. వీర సైనికుల పోరాట పటిమపై ప్రశంసలు కురిపిస్తోంది. ఈ క్రమంలోనే దేశ రక్షణకు సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన పలువురు జవాన్లు ఉద్వేగంతో ఉప్పొంగుతున్నారు. అధికారులు రీకాల్ చేస్తే మళ్లీ కదన రంగంలోకి దూకేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడిస్తున్నారు. శత్రుమూకలను చెండాడేందుకు ఉత్సుకతతో ఎదురు చూస్తున్నామని వివరిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ప్రత్యేకంగా 'సాక్షి'తో మాట్లాడారు. – తిరుపతి సిటీ

- భారత సైన్యంపై వెల్లువెత్తుతున్న ప్రశంసలు
- ఆపరేషన్ సిందూర్‌పై హర్షాతిరేకాలు
- ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడంపై అభినందనలు
- రీకాల్ కోసం ఎదురుచూస్తున్నామంటున్న ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ విశ్రాంత అధికారులు



ఆంజనేయస్వామికి పూజలు చేయిస్తున్న నేతలు



భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

ఇప్పటికీ సిద్ధం



నేను రక్షణ దళంలో హవల్దార్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యా. శ్రీలంక ఎల్టీటీఈ, కార్గిల్ యుద్ధం సమయాలలో ఆర్మీ బ్లాకోట్ కమాండర్‌గా పనిచేశా. ఇప్పుడు ఆర్మీ అధికారులు రీకాల్ చేస్తే కదన రంగంలో దిగేందుకు ఇప్పటికీ సిద్ధంగా ఉన్నా. – పూజారి ఆనంద్‌రెడ్డి, రిటైర్డ్ హవల్దార్, తిరుపతి

కేవలం 24 నిముషాల్లోనే..



నేను రిటైర్డ్ ఆర్మీ సుబేదార్. జమ్ముకాశ్మీర్ సరిహద్దులతో పాటు ప్రస్తుతం జరిగిన ఆపరేషన్ సిందూర్ ప్రాంతంలోని అనంతనాగ్ జిల్లాలో పనిచేశా. ఉగ్రవాదుల21 స్థావరాలను ఆర్మీ ఇంటెలిజన్స్ గుర్తించి ఆపరేషన్ సిందూర్ పేరుతో మెరుపు దాడికి దిగింది. ఇందులో 9 ఉగ్రవాద స్థావరాలను భారత దళాలు కేవలం 24 నిమిషాల్లోనే ధ్వంసం చేశాయి. ఆర్మీ అధికారులు రీకాల్ చేస్తే వెళ్లేందుకు సిద్ధం. – జి.జయప్రకాష్‌రెడ్డి, రిటైర్డ్ సుబేదార్, తిరుపతి

ఏరిపారేస్తుంది



దేశ వైమానిక దళంలోని సాంకేతిక విభాగంలో పనిచేసి రిటైర్డ్ అయ్యాను. ఆపరేషన్ సిందూర్ విజయంతో భారత సైన్యం సత్తా మరోసారి శత్రుదేశాలకు తెలిసొచ్చింది. సైన్యం ధైర్యసాహసాలకు యావత్ భారత్ గర్వపడుతోంది. భారత సైన్యం యుద్ధరంగంలో శత్రుమూకను ఏరిపారేస్తుంది. వైమానిక దళం నుంచి కాల్ వస్తే దేశానికి మరో మారు సేవచేసేందుకు సంసిద్ధం. – బొగ్గద రాజేంద్ర, రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి, తిరుపతి

ఎదురుచూస్తున్నా



నేను జమ్మూ, పంజాబ్, కార్గిల్ సరిహద్దుల్లో పనిచేశా. ఆర్మీలో హవల్దార్‌గా రిటైర్డ్ అయ్యా. దేశంకోసం పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా. ప్రస్తుత యుద్ధవాతావరణంలో రిటైర్డ్ అయిన మాలాంటి వారి సేవలు రక్షణశాఖకు అవసరమైతే రీకాల్ చేస్తారు. అపూర్వ శక్తి సామర్థ్యాలు గల త్రివిధ దళాలు భారత్ సొంతం. – ఎల్.మునిచంద్రయ్య, రిటైర్డ్ హవల్దార్, తిరుపతి

సత్తా చాటింది



నేను రక్షణ దళంలో ఆర్మీ ఆఫీసర్‌గా రిటైర్డ్ అయ్యా. దేశ సరిహద్దులలో పనిచేశా. శత్రు దేశాలు పెంచిపోషిస్తున్న ఉగ్రవాదులను భారత సైన్యం మట్టు పెట్టింది. దేశానికి ఇదో చారిత్రాత్మక దినం. పూర్తి స్థాయి యుద్ధమే వస్తే శత్రు దేశాన్ని ధ్వంసం చేయడానికి కేవలం ఒక రోజు కూడా పట్టదు. ఆర్మీ అధికారులు రీకాల్ చేస్తే సేవ చేయడానికి సిద్ధం. – బి.మోహన్‌రెడ్డి, రిటైర్డ్ ఆర్మీ అధికారి, తిరుపతి

సైన్యానికి సెల్యూట్



నేను ఎయిర్‌ఫోర్స్ సార్జంట్ హోదాలో పని చేసి రిటైర్డ్ అయ్యా. కార్గిల్ సమయంలో అస్సాం బోర్డర్‌లో విధులు నిర్వర్తించా. మన త్రివిధ దళాలు శత్రువుల అంతు చూసేవరకు పోరుబాట విడవవు. సైన్యానికి సెల్యూట్ చేయాలి. అవకాశం వస్తే యుద్ధరంగంలో మళ్లీ కాలుమోపుతాం. – పి.కిషోర్ కుమార్, రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ సార్జెంట్, తిరుపతి

వైఎస్సార్‌సీపీలోకి 'యాలమూరి'



యాలమూరి శ్రీనివాసులురెడ్డికి కండువా వేస్తున్న భూమన

తిరుపతి మంగళం : ప్రముఖ వ్యాపారవేత్త, యాలమూరి శ్రీనివాసులురెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం తిరుపతి పద్మావతిపురంలో ని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. యాలమూరి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో తిరుపతి నగరం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రతి పేదవాడి ముంగిటకే జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కనుమరుగైందని, సంక్షేమ పథకాల ఊసే లేదని విమర్శించారు.

రెచ్చగొట్టే మెసేజ్‌లను సహించం

తిరుపతి క్రైం: విద్వేషాలు రెచ్చగొట్టేలా మెసేజ్‌లు ఫార్వర్డ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. పాక్‌లోని ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని మన సైన్యం దాడులు చేసిన నేపథ్యంలో విద్వేషపూరితమైన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా షేర్ చేసినా, పోస్ట్ చేసినా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఆయా మెసేజ్‌లకు గ్రూప్ అడ్మిన్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రశాంతంగా ఐసెట్

తిరుపతి సిటీ: జిల్లాలో బుధవారం నిర్వహించిన ఐసెట్ ప్రశాంతంగా ముగిసింది. పుత్తూరు, గూడూరు, విద్యానగర్, తిరుపతిలో ని ఐదు కేంద్రాలలో పరీక్షకు 3వేల మందికి గాను 2,800మందికి హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ఏబీవీపీ కార్యకర్తల నిర్బంధం

పీజీ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, ఈ దిశగా విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటన చేయకుంటే ఐసెట్‌ను అడ్డుకుంటామని ఏబీవీపీ కార్యకర్తలు హెచ్చరించిన నేపథ్యంలో పోలీసులు స్పందించారు. ఏబీవీపీ నాయకులు సురేంద్ర, పవన్, కిషోర్‌ను స్టేషన్‌లోనే కూర్చోబెట్టారు. వర్సిటీల ఏబీవీపీ కో–కన్వీనర్ క.తరుణ్‌తో పాటు మరికొంతమంది కార్యకర్తలను హౌజ్ అరెస్ట్ చేసి నోటీసులు ఇచ్చారు.

అల్లూరి త్యాగం అజరామరం



అల్లూరికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్:బ్రిటీష్ పాలకులపై పోరాటాలు చేసిన అల్లూరి సీతారామరాజు త్యాగం అజరామరమని కలెక్టర్ వెంకటేశ్వర్ కొనియాడారు. బుధవారం కలెక్టరేట్‌లో అల్లూరి సీతారామరాజు వర్ధంతి నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం అల్లూరి చేసిన సేవలు మరువలేమన్నారు. బ్రిటీష్ పాలకుల దోపిడీపై గిరిజన ప్రజలను చైతన్యవంతం చేశారని వెల్లడించారు. సెట్విన్ సీఈఓ మోహన్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ జిల్లా అధికారి జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాహసయాత్ర



విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందిస్తున్న అసోసియేట్ డీన్

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పశు వైద్య కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఏప్రిల్ 18 నుంచి ఈనెల 2వ తేదీ వరకు జమ్ము, కశ్మీర్, పెహల్గామ్ ప్రాంతాల్లో చేపట్టిన సాహసయాత్ర విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణలో విద్యార్థులు దుర్గాప్రసాద్, భవితశ్రీ, గౌరీ పాల్గొన్నారు. యాత్ర పూర్తి చేసుకుని బుధవారం కళాశాలకు విచ్చేసిన విద్యార్థులకు అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య ఎన్‌సీసీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎన్‌సీసీ అధికారి సుధీర్ పాల్గొన్నారు.

కోర్టుల్లో 171 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కోర్టుల్లో పలు పోస్టుల భర్తీకి హైకోర్టు నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 171 పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొంది. ఇందులో స్టెనోగ్రాఫర్ 7, జూనియర్ అసిస్టెంట్ 25, టైపిస్ట్ 13, ఎగ్జామినర్ 3, కాపీయిస్ట్ 17, ప్రోసెస్ సర్వర్ 21, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు 85 చొప్పున ఖాళీలున్నట్లు తెలిపింది. అభ్యర్థులు www. aphc.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 13 నుంచి వచ్చేనెల 2వ తేదీ అర్ధరాత్రి 12 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే జిల్లా కోర్టు పరిధిలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న వారు ఈనెల 13 నుంచి వచ్చేనెల 24వ తేదీలోపు చిత్తూరులోని జిల్లా కోర్టుకు వచ్చి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఇతర వివరాలకు చిత్తూరు జిల్లా కోర్టులోని పరిపాలన అధికారిని సంప్రదించాలని అధికారులు తెలిపారు.

ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లుగా అయూబ్ ఖాన్, గురవయ్య



పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్:ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లుగా పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రాజెక్టు విభాగపు డైరెక్టర్‌గా పి.అయూబ్‌ఖాన్, టెక్నికల్ విభాగపు డైరెక్టర్‌గా కె.గురవయ్య విధులు నిర్వర్తించనున్నారు. సీఎండీ కె. సంతోష రావు పుష్పగుచ్ఛం అందించారు.

దొంగను పట్టించిన 'నిఘా'

తిరుపతి క్రైమ్: అలిపిరి పోలీస్ స్టేషన్ నిఘా నేత్రం ఓ దొంగను పట్టించింది. వివరాలు.. గొల్లవానిగుంట మెయిన్ రోడ్‌లోని ఓ ఇంటి యజమాని సెలవులు కావడంతో ఊరికి వెళ్లాడు. ఈ క్రమంలో ఎల్‌హెచ్ఎంఎస్(లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టం) ద్వారా పోలీసులకు చెప్పి ఇంటికి కెమెరాలు పెట్టించాడు. ఓ దొంగ గోడ ఆ ఇంటోకి రాగానే కంట్రోల్ రూమ్‌లో సైరన్ మోగింది. ఎస్ఐ లోకేష్ సిబ్బందితో వెళ్లి దొంగను అదుపులోకి తీసుకున్నారు.

బైరాగి వేషం.. భక్తి పరవశం





శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. తొలి రోజు బుధవారం బైరాగి వేషం ధరించి భక్తులు అమ్మవారిని సేవించుకున్నారు. ఆలయ ఆవరణలోని తల్లి పాదాల చెంత నృత్యాలు చేశారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో గురువారం సంప్రదాయబద్ధంగా భక్తులు బండ వేషం వేసుకుని అమ్మవారిని దర్శించుకోనున్నారు. – తిరుపతి కల్చరల్